# నల్లమల చెంచులపట్ల బాలగోపాల్ తపన

**సెప్టెంబర్ 2వ తేదీ** సాయంత్రం ముఖ్యమంత్రి వై.ఎస్. హెలికాప్టర్ అదృశ్యమైన వార్తలు వెలువడుతున్నాయి. నెల్లిమర్ల జూట్‌మిల్లు పారిశ్రామిక వివాదానికి చెందిన ఒక కేసు గురించి నేను, బూర్గుల ప్రదీప్ (ఇప్పుడు అఖిల భారత ప్రధాన కార్యదర్శి) ఆ సమయానికి హైదరాబాద్‌లోని డాక్టర్ కె. బాలగోపాల్ ఇంటికి వెళ్లాం. మరికొద్దిసేపటికే ఎ.ఐ.ఎఫ్.టి.యు నేత ఎస్. రామచంద్రరావు, మరొక మిత్రునితో అక్కడికి వచ్చారు. బాలగోపాల్ సాధారణంగా అవసరం ఉన్న మేరకే మాట్లాడే మితభాషి! కానీ పై నేపథ్యంవల్ల ఆ రోజు మాతో సుమారు అరగంట ఇష్టాగోష్టిగా మాట్లాడారు. అదృశ్యమైన హెలికాప్టర్ జాడలను వెతికి పెట్టమని నల్లమల ప్రాంత ఆదివాసులైన చెంచులకు మంత్రి రోశయ్య మీడియా ద్వారా విజ్ఞప్తి చేశారు. ఆ వార్తను ఆయన సహచరి వసంతలక్ష్మి మా మధ్య ప్రస్తావించారు. వెంటనే బాలగోపాల్ స్పందించి మూడు వ్యాఖ్యలు చేశారు.

నక్సల్స్ ఏరివేత పేరిట గతంలో నల్లమల అడవుల నుంచి చెంచులను తరిమివేసిన ప్రభుత్వానికి ఇప్పుడు వారే దిక్కయ్యారని ఆయన వ్యంగ్య వ్యాఖ్యచేశారు. అదృశ్యమైన హెలికాప్టర్‌ని కనిపెట్టడంలో ఆధునిక సాంకేతిక, వైజ్ఞానిక పరిజ్ఞానం కంటే ఆదివాసులే నయమని ఇప్పటికైనా మన పాలకులు గుర్తించారు కాబోలు అని మరో వ్యాఖ్య చేశారు. అడవుల నుంచి చెంచులను తరిమివేసిన తమ రాజకీయ తప్పిదాన్ని గుర్తించి తగిన గుణపాఠాన్ని ప్రభుత్వం తీసుకుంటుందేమో చూడాలని కూడా ఆయన అన్నారు. తాను నవ్వకుండా అక్కడ ఉన్న మమ్మల్ని నవ్వించిన ఈ మూడు వ్యాఖ్యలు కూడా అత్యంత భావగర్భితమైనవి.

ఆయన మాతో పై వ్యాఖ్యలు చేసిన సమయానికి వై.ఎస్. మృతి ధృవీకరణ

జరగలేదు. నల్లమల అడవుల్లో ఏదో ఒక మూలన ఒకవేళ వై.ఎస్. హెలీకాప్టర్ సురక్షితంగా దిగినా, ఎలా వెతికి క్షేమంగా బయటికి తీసుకుని రావాలన్న సమస్యను ఆ సమయాన ప్రభుత్వం ఎదుర్కొంటున్నది. వై.ఎస్. జీవించి ఉంటారనే అంచనాతో ఆయన పై వ్యాఖ్యలు చేశారు. పై మూడే మూడు అతి చిన్న వ్యాఖ్యలు బాలగోపాల్ సునిశిత రాజకీయ వైఖరినీ, సూక్ష్మ గ్రహణశక్తిని వెల్లడిస్తాయి. అంతేకాకుండా తాను నవ్వకుండా ఎదుటి వారిని నవ్వించే ఆయన హాస్యరసికతను కూడా అర్థం చేసుకోవచ్చు.

హెలికాప్టర్ అదృశ్య సంఘటన గురించి జరుగుతున్న ప్రచార సమయంలో రకరకాల ఊహలు, అంచనాలతో తమ మెదళ్లకు పదునుపెట్టిన మేథో పండితులు ఈ రాష్ట్రంలో వేల సంఖ్యలోనే ఉండవచ్చు. వీరిలో రాజకీయ, సామాజిక, సైనిక, సాంకేతిక, వైజ్ఞానిక రంగాలలోని బహుముఖ ప్రజ్ఞావంతులు ఉండడం సహజమే. కానీ వీరందరికంటే బాలగోపాల్ దృక్కోణం గుణాత్మకంగా భిన్నమైంది. ఆయన దృష్టి నల్లమల అడవుల నుంచి రాజ్యం చేత బలవంతంగా తరిమివేయబడ్డ చెంచుల మీదనే కేంద్రీకృతమైంది. రాజ్య పాలకులు పయనించే ఆధునిక వైమానిక ప్రమాదాన్ని కూడా రాజ్యం చేత ప్రమాదంలో చిక్కుకున్న ఆదివాసుల జీవిత దృక్కోణం నుంచే ఆయన పరిశీలించారు. ఈ తత్వమే బాలగోపాల్‌ను సమకాలీన సమాజంలో సమున్నతునిగా తీర్చిదిద్దింది.

గత రెండున్నర దశాబ్దాలుగా సాగుతున్న నెల్లిమర్ల, ఏలూరు జూట్ మిల్లుల కార్మికోద్యమాల మీద వివిధ సందర్భాలలో రక్తసిక్త దమనకాండలు, ప్రాణార్పణలు, రక్తతర్పణల సంఘటనలు జరిగాయి. ఆయా సందర్భాలన్నింటా బాలగోపాల్ పాత్ర ఉంది. ఈ అన్నింటా ఆయనతో నాకు ఏర్పడిన సాన్నిహిత్యం ఆయన్ని నాకొక ఆత్మబంధువును చేసింది. ఇంకా అనేక పీడిత, తాడిత ప్రజా ఉద్యమ వేదికల మీద మేము సహచరులుగా పాల్గొన్నాము. ఆయనలోని ఆదర్శాలను దగ్గర నుండి చూశాను. నెల్లిమర్ల జూట్ మిల్లు కేసులో ఆయన మృతికి రెండు రోజుల ముందు వరకూ ఆయనతో ఫోన్‌లో సంప్రదిస్తూనే ఉన్నాను. నేను ప్రాతినిధ్యం వహిస్తున్న కార్మిక వర్గ ఉద్యమాలతో ఆయనకు గల అధిక అనుబంధం కంటే, సోకాల్డ్ నాగరిక రాజ్యం చేత అణిచివేయబడ్డ గిరిజనుల పట్ల బాలగోపాల్ అనంత తపనకే ఈ సమయంలో ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వడం ద్వారానే ఆయనకు సరైన నివాళి అర్పించినట్లవుతుంది.

**– పి. ప్రసాద్,** ఇఫ్టూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

*13 అక్టోబర్, మంగళవారం 2009 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో*